నమస్తే తెలంగాణ
నిజామాబాద్
12 | నిజామాబాద్, ఆదివారం 12 జనవరి 2025 | NIZAMABAD

## నేడు జిల్లాకు ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ, జనవరి 11: ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవిత నేడు (ఆదివారం) నిజామా బాద్, బాన్సువాడ నియోజకవర్గాల్లో పర్య టించనున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12గంటలకు నిజామాబాద్ ప్రీమియర్ లీగ్‌కు హాజరవుతా రని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తబ్లీగీ జమాత్ వేదిక, రెండు గంటలకు వర్ని మండలంలోని బడా పహాడ్ దర్గా(పెద్ద గుట్ట)ను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు బాన్సువాడకు వస్తారని పేర్కొన్నారు. ఆమెకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని కొయ్యగుట్ట అమ రవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారని తెలిపారు. స్థానిక అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొని, బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతారని తెలిపారు. పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# కాంగ్రెస్ గూండాల అరాచకం

- యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి
- తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి వేముల, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**యాదాద్రి** భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. పోలీసుల సమక్షంలోనే ఎన్ఎస్‌యూఐ నాయకులు ధ్వంస రచనకు పాల్పడ్డారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితోపాటు పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు.

## రెచ్చిపోతున్న 'హస్తం' మూకలు

**సీఎం ప్రోద్బలంతోనే దాడులు**
**బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకే హింసాత్మక చర్యలు**
**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

ఖలీల్‌వాడి, జనవరి 11 : యాదాద్రి భువ నగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా ఖండించారు. సీఎం ప్రోద్బ లంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు. భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయ పెట్టలేరని స్పష్టంచేశారు. ఈ దాడిని పిరికి పంద చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ తన యువజన విభాగాన్ని గూండాల విభాగంగా తీర్చిదిద్దుతున్నదని మండిపడ్డారు.యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ జరిపిన దాడి, వారి అసలు రంగును బట్టబయలు చేసిందని, కాంగ్రెస్ విష సంస్కృతికి ఇదొక

నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి సిగ్గుమాలిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పింది

- కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తున్నది
- బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, జనవరి 11: రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాల యంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. శని వారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన నాటి నుంచి ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ఆరు గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ ఎస్ నేతలు, కార్యాలయాలపై రేవంత్ సర్కార్ అక్రమ కేసులు పెడుతూ...దాడుల కుపాల్పడుతున్నదని మండిప డ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వా మ్యాన్ని పాతరేస్తూ హింసను ప్రేరే పిస్తుందని ఘాటుగా విమర్శిం చారు. మాట్లాడితే ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు దాడులకు పాల్పడమే ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలనా సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడిని వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ రాజ్యమంటే హింసా, ధ్వంసమేనా ?

- ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే దాడులు
- కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుంటాం ..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, జనవరి 11 : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆ ర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ నిజామా బాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శనివారం విడు దల చేసిన ఒక ప్రకటనలో తెలి పారు. ఇందిరమ్మ రాజ్యమంటే హింసా, ధ్వంసమేనా ? ప్రజా పాలనంటే కాంగ్రెస్ కండకావరమా ? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం తోనే దాడులు జరుగుతున్నాయని పేర్కొ న్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజాసమస్యలపై ప్రశ్నించినం దుకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చాక దాడులు, విద్వేష, విష సంస్కృతులు, అక్రమ నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాగే దాడులు జరిగి ఉంటే కాంగ్రెస్‌కు పుట్టగతులుండేవా ? అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఏడాది కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడికి నిలయంగా మారిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని, కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుంటామని జీవన్‌రెడ్డి హెచ్చరించారు.

# అటు ఆర్తనాదాలు.. ఇటు ఆనందోత్సాహాలు

వైద్యం కోసం భార్యను భుజాన వేసుకుని దవాఖాన లోపలికి వెళ్తున్న బిద్యానాయక్

## జీజీహెచ్‌లో దారుణం

- రోగులను విస్మరించి వేడుకల్లో వైద్య సిబ్బంది
- భార్యను భుజాన వేసుకుని.. దవాఖాన మొత్తం తిరిగిన బాధితుడు
- వారిని పట్టించుకోని వైద్య సిబ్బంది
- మేడమ్ బర్త్‌డే వేడుకల ఏర్పాట్లలో నిమగ్నం
- గ్రాండ్‌గా సూపరింటెండెంట్ పుట్టినరోజు
- డ్యూటీలు విస్మరించి ఉత్సాహంగా పాల్గొన్న సిబ్బంది

*నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్)లో దారుణం చోటు చేసుకున్నది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను గాలికొదిలేయడం కలకలం రేపింది. అదే సమయంలో దవాఖానలోనే గ్రాండ్‌గా బర్త్‌డే వేడుకలు నిర్వహించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. వైద్య సిబ్బంది విధులను విస్మరించి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పుట్టిన రోజు వేడుకల ఏర్పాట్లలో నిమగ్నం కావడం, అదే సమయంలో ఫిట్స్‌తో బాధ పడుతున్న భార్యను భుజాన వేసుకుని వచ్చిన వ్యక్తిని పట్టించుకోక పోవడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. అటు బాధితుడి ఆర్త నాదాలు, ఇటు మేడమ్ బర్త్‌డే సెలబ్రేషన్స్ వీడి యోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ అంశం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.*
*-ఖలీల్‌వాడి, జనవరి 11*

సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది

జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్ పుట్టినరోజు శనివారం కావడంతో గ్రాండ్‌గా సెలబ్రేషన్స్ నిర్వహించాలని వైద్య సిబ్బంది భావించారు. శుక్రవారం సాయంత్రం నుంచే మేడమ్ చాంబర్‌లో ఏర్పాట్లలో తలమునకలయ్యారు. విధులు పక్కన పెట్టి ఆ గదిని ఫంక్షన్‌హాల్‌గా తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన బిద్యానాయక్ భార్యకు ఫిట్స్ రావడంతో శుక్రవారం రాత్రి హుటాహుటిన జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. గేట్ వద్ద ఎవరూ లేకపోవడంతో భార్యను భుజాన వేసుకుని బిద్యానాయక్ దవాఖాన వైరల్ అయింది. కానీ, దాన్ని లైట్‌గా తీసుకున్న వైద్య సిబ్బంది తాము అనుకున్నట్లుగానే ప్రతిమారాజ్ పుట్టి నరోజు వేడుకలను అత్యంత వైభవం గా నిర్వహించారు. మేడమ్ చాంబర్‌ను ఫంక్షన్‌హాల్‌గా తీర్చిదిద్దిన కేక్ కట్ చేయించారు. దవాఖాన సిబ్బంది మొత్తం ప్రతిమారాజ్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు, గిఫ్ట్‌లు ఇచ్చేందుకు పోటీ పడ్డారు. వారంతా విధులు విస్మరించి వేడుకల్లో నిమగ్నం కావడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బర్త్‌డే వేడుకలకు సంబంధించిన వీడియోలు కూడా వైరల్ కావడంతో రోగులు, బంధువులు వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. ఒకవైపు రోగులు ప్రాణాపాయంలో ఉంటే ఇలా విధులు ఎగ్గొట్టి వేడుకల్లో పాల్గొనడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, జీజీహెచ్‌లో వేడుకలు నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలంటే ఇంట్లో, ఫంక్షన్ హాళ్లలో చేసుకోవాలి కానీ దవాఖానలో జరుపుకోవడం, రోగులను గాలికొదిలేసి సెలబ్రేషన్స్‌లో నిమగ్నం కావడమేమిటన్న ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వివరణ కోరేందుకు యత్నించగా, ఆమె స్పందించ లేదు.

**పోటీ పడి మరీ..**
జీజీహెచ్‌లో బిద్యానాయక్ అవస్థలకు సంబంధించిన వీడియో శనివారం ఉదయం నుంచే సోషల్ మీడియాలో

## అటవీ భూమిలో అక్రమంగా చదును..

**17 మందిపై కేసు నమోదు**

సిరికొండ, జనవరి 11 : మండలంలోని రాంచంద్రా పల్లి కంపార్ట్‌మెంట్ నంబర్ 391లో శుక్రవారం రాత్రి సమయంలో అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తున్న చింతల తండా గ్రామానికి చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఆర్వో గంగారాం తెలిపారు. అడవులను అక్రమంగా నరికి భూములను చదును చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

మోస్రాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

## హామీలు అమలు చేయాలి

**బీఆర్ఎస్ నాయకుల నిరసన**

మోస్రా(చందూర్), జనవరి 11: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మోస్రా మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, రైతులకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తున్నదే తప్ప, ఎలాంటి అభివృద్ధి చేయడంలేదన్నారు. ఈ సందర్భంగా రేవంత్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. రైతు బాగుండాలంటే కేసీఆర్ రావాలని కోరారు. కార్యక్రమంలో మోస్రా, చందూర్ మండలాల బీఆర్ఎస్ నాయకుడు మాధవరెడ్డి, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే ఆర్మూర్‌కు రావొద్దు!

- అబద్ధాల హామీలతో కాలయాపన చేస్తున్న రాకేశ్‌రెడ్డి
- రెండురోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు
- నియోజకవర్గంలో వైరల్.. ప్రజల్లో విస్తృత చర్చ




నందిపేట్, జనవరి 11 : ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పనితీరుపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నిక లకు ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలుచేయకుండా హైద రాబాద్‌కే పరిమితమైన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి నియోజకవర్గానికి రావొద్దంటూ పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎమ్మెల్యే మాటల్లోనే దూకుడుగా కనిపిస్తు న్నాడని, అభివృద్ధి పనుల్లో మాత్రం కనిపిం చడంలేదంటూ విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఎమ్మెల్యేను నిలదీస్తూ వైరల్ అవు తున్న పోస్టులు బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణు లకు షేర్ చేస్తున్నారు. తాను అందరి కన్నా ఎక్కువగా మాట్లాడుతాననే ముద్ర వేసుకు నేందుకు ఉబలాటపడుతున్న రాకేశ్‌రెడ్డి, పదవిలోకి వచ్చి ఏడాది కాలమైనా నియో జకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. తన సొంత పనుల కోసమే సమయాన్ని కేటా యిస్తూ ప్రజాపాలనను గాలికివదిలేశాడని పేర్కొన్నారు. అంతేగాక తాను గెలిచిన తరు వాత రూపాయికే వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చాడని, ఇప్పుడు ఆ ఒక్క రూపాయి వైద్యం ఎటుపోయిందంటూ ప్రశ్నించారు. యువతకు ఉపాధి ఎక్కడ అని, సొంతంగా ఇండ్లు కట్టిస్తానని ఒక్క ఇల్లు కట్టించలేదని, ఉపాధి కోసం నిరు ద్యోగ యువకులను విదేశాలకు పంపుతా నని సమాచారం సేకరించి ఏం చేశాడని, హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి ఎవరూ రావద్దంటూ సామాన్యులకు దూరంగా ఉంటున్నాడంటూ పోస్టు చేశారు. ప్రభుత్వ అధికారులతో దురుసు మాటలు, ధనవంతులు తన ఇంటికి రావ ద్దంటూ, పేదవాడు వస్తే మాత్రం సహాయం చేయడం లేదని పేర్కొంటూ సోషల్ మీడియాల్లో ప్రశ్నిస్తూ తయారుచే సిన పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. రెండురోజులుగా వైరల్ అవుతున్న ఈ పోస్టులపై నియోజకవర్గంలో చర్చ జరుగు తున్నది. పార్టీలకు అతీతంగా ఈ పోస్టును వైరల్ చేస్తుండడం గమనార్హం.

## గ్రామసభలను పక్కాగా నిర్వహించాలి

**అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం**

మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24 వరకు పంచాయతీ పరిధిలో గ్రామసభలు, మున్సి పల్ పరిధిలో వార్డు సభలను పక్కాగా నిర్వ హించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాల అమలుకు చేపట్టా ల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారు లకు కలెక్టర్ శనివారం జూమ్ మీటింగ్ ద్వారా దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పట్టాపాస్ పుస్త కాలు ఉన్న రైతులకు వానకాలం, యాసంగి సీజన్లను కలుపుకొని ప్రతిఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నదని తెలి పారు. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియతోపాటు గ్రామసభలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావే శంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, ఆర్డీ వోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీ వోలు, తహసీల్దార్లు, ఏపీవోలు పాల్గొన్నారు.

## సంక్రాంతి స్పెషల్

**మండల కేంద్రంలో** శనివారం నిర్వహించిన మేకల సంతలో కోట్ల రూపాయల క్రయ, విక్రయాలు జరిగాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రూ. 3.50 కోట్లకు పైగా జీవాల క్రయ విక్రయాలు సాగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో జీవాలను సంతకు తరలించారు. చిన్న మేక రూ. ఐదు వేలు, పెద్ద మేకలు రూ.16 వేలకు తగ్గకుండా ధర పలకడం గమనార్హం.
*-నవీపేట,జనవరి 11*

## సీట్ల కోసం పాట్లు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు తమ స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. దీంతో జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ శనివారం కిక్కిరిసి పోయింది. బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు నానాపాట్లు పడాల్సివచ్చింది. కొందరు కిటికీల నుంచి తమ చిన్నారులను లోపలికి పంపించగా..మరికొందరు డ్రైవర్ సీటు నుంచి చొచ్చుకెళ్లారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడపకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తంచేశారు.
-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్